హైరానా లేకుండా..

ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగం

- వృద్ధులు, దివ్యాంగులకు తప్పిన తిప్పలు
- ప్రత్యేక సౌకర్యంపై సర్వత్రా హర్షం





మర్రిగూడెం గ్రామంలో దివ్యాంగుడి ఇంటివద్ద ఎన్నికల అధికారులు

ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అన్ని రాజకీయ పక్షాల ప్రచార హడావుడి తుది ఘట్టానికి చేరుకుంది. ఎన్నికల అధికారులు సైతం పోలింగ్ సంబంధించిన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ 30న ఓటు హక్కు వినియోగించుకోనుండగా దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు మాత్రం తమకు నచ్చిన అభ్యర్థులకు మంగళ, బుధవారాల్లో ఓటు వేశారు. ఎన్నికల సంఘం ఈ దఫా కల్పించిన ప్రత్యేక సౌకర్యంతో దివ్యాంగులు, వృద్ధులు ఎలాంటి హైరానా లేకుండా ప్రశాంతంగా ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

కదల్లేని పరిస్థితిలో ఉన్న దివ్యాంగులకు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు తొలిసారి ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 484 మంది వృద్ధులు, 241 మంది దివ్యాంగులు, 41 మంది ఎసెన్షియల్ ఆల్ సర్వీసెస్ పరిధిలో మొత్తంగా 766 మంది ప్రత్యేకంగా ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యానికి అర్హత పొందారు.

గతంలో పడుతూ.. లేస్తూ...

ఎన్నికలు ఎప్పుడు జరిగినా పోలింగ్ రోజు మాత్రం వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం పడుతూ.. లేస్తూ.. పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకునేవారు. ఓటు వేయాలన్న సంకల్పం ఉన్న వారు కుటుంబ సభ్యుల సహాయంతో పోలింగ్ కేంద్రానికి చేరుకోగా.. అక్కడ పోలింగ్ సిబ్బంది వీల్ చైర్‌లలో ఈవీఎం వద్దకు తీసుకెళ్లి ఓటు వేయించేవారు. ఇదే అదునుగా పలు రాజకీయ పక్షాలు ఇంటి వద్ద ఉన్న వృద్ధులు, దివ్యాంగులను లక్ష్యంగా చేసుకొని ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లేవారు. ఇక పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లేందుకు ఒక్కో కేంద్రానికి ఒకటి మాత్రమే వీల్ చైర్ ఉండేది.. దీంతో కొందరిని చేతుల మీద, మరికొందరిని వీల్ చైర్‌లలో ఈవీఎం వద్దకు తీసుకెళ్లేవారు. నిన్నటి వరకు వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేయాలంటే అంతగా హైరానా పడాల్సి వచ్చేది.

తాజాగా ఇంటి వద్దే..

ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యంతో నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులు బుధ, గురువారాల్లో ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యాన్ని పొందారు.. దీనికోసం పోలింగ్ సిబ్బంది.. బ్యాలెట్ పత్రాలు, కంపార్ట్‌మెంట్, ఇతర సామగ్రితోపాటుగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు చేరుకున్నారు. వారికి ముందుగా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించి ఓటు వేసే అవకాశం కల్పించారు. వారు ఓటు హక్కును వినియోగించుకునే తీరును ప్రత్యేకంగా వీడియోలో చిత్రీకరించారు. పార్టీ అభ్యర్థుల ఏజెంట్లు, పోలీసు భద్రత నడుమ ప్రక్రియను కొనసాగించారు.

స్వేచ్ఛగా ఓటు వేశా..



గతంలో ఏదో ఒక పార్టీ వాళ్లు ఇంటికి వచ్చి తమ పార్టీకే ఓటు వేయాలని ఓట్లు వేయించుకునేవారు. అలా చేస్తేనే వారికి సంబంధించిన వాహనంలో పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్ళేవారు. నేడు అధికారులు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకోవడం ఆనందంగా ఉంది. తొలిసారిగా స్వేచ్ఛగా నాకిష్టమైన అభ్యర్థికి ఓటు వేసే అవకాశం దక్కింది.

– ఇర్ప కిష్టయ్య, దివ్యాంగుడు, మర్రిగూడెం, ఇల్లెందు మండలం

అప్పట్లో ఇబ్బందిపడ్డా..



నాకు వృద్ధాప్యంతోపాటు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. పోలింగ్ రోజున ఓటు వేయాలని ఉన్నా అక్కడికి చేరుకోవడం ఇబ్బందిగా ఉండేది. కుటుంబ సభ్యుల సహాయంతో ప్రత్యేక ఆటోలో కేంద్రం వద్దకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ వీల్‌చైర్ లేకపోతే చేతుల మీద లోనికి తీసుకెళ్లి ఓటు వేయించేవారు. నేడు ఆ హైరానా లేకుండా ఇంటి వద్దే ఓటు వేశా..

– బానోత్ దస్రు, వృద్ధుడు, పోలారం

ఆనందంగా ఉంది



ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అందరితోపాటు ఓటు వేయాలని ఉంటుంది. కానీ పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లడం సమస్యగా కనిపించేది. ఈదఫా ఎన్నికల అధికారులు నడవలేని మా పరిస్థితిని, ఓటు వేసేందుకు ఇంతకాలం పడ్డ ఇబ్బందిని చూసి స్పందించారు. ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఆనందంగా నచ్చిన అభ్యర్థికి ఓటు వేశా.

– బూర్సు కృష్ణ, దివ్యాంగుడు, నెహ్రూనగర్

ముగిసిన ప్రత్యేక ఓటర్ల పోలింగ్

టేకులపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రానికి రాలేని వారి కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటుని కల్పించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మండలంలో 29 మంది వయో వృద్ధులు, దివ్యాంగులు 10 మొత్తం 39 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం పోలింగ్ 17, బుధవారం 21 మంది ఓటు వేశారు. మొత్తం 38 మంది ఓటు వేయగా ఒకరు మృతి చెందారు. ఎన్నికల అధికారిగా టేకులపల్లి ఎంపీఓ గణేష్ గాంధీ వ్యవహరించారు. ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఏఈవో విశాల, అంగన్‌వాడీ టీచర్, పోలీసు సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.



గంగారంలో ఓ ఇంటి వద్ద పోలింగ్ సిబ్బంది

బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపండి..

- ఎంపీ రవిచంద్ర, కొత్తగూడెం బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం న్యాయవాదుల పక్షపాతి అని, న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించిన ప్రభుత్వం తమదేనని కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన న్యాయవాదులతో ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ.. మళ్లీ అవకాశం ఇస్తే దానికి తోడుగా రూ.500 కోట్లకు పెంచేందుకు సిద్ధంగా ఉందని, న్యాయవాదులకు 2018 ఏడాది నుండి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ కల్పించడం జరుగుతుందన్నారు. ఇళ్ల స్థలాలను కేటాయించడానికి, దురదృష్టవశాత్తు మరణిస్తే ప్రభుత్వం నుండి రూ.4లక్షలు కేటాయించడానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏపీపీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. న్యాయవాదులను అన్ని విధాల ఆదుకునే బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికి అధిక మెజారిటీతో మిమ్మల్ని గెలిపిస్తామని న్యాయవాదులు పూర్తి మద్దతు తెలిపారని తెలిపారు.

నాయకుల ప్రచారం..

చుంచుపల్లి: కొత్తగూడెం బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ రుద్రంపూర్, గౌతమ్ పూర్, ధన్‌బాద్ ప్రాంతాల్లో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా నమూనా బ్యాలెట్ పత్రాలను పంపిణీ చేసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ధన్‌బాద్ సర్పంచ్ రాందాస్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



కొత్తగూడెంటౌన్: న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన వనమా వెంకటేశ్వరావు



చుంచుపల్లి: ధన్‌బాద్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల, నాయకులు

నేడు పవన్‌కల్యాణ్ సభ

చుంచుపల్లి: కొత్తగూడెం జనసేన అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ప్రకాశం స్టేడియంలో నిర్వహించే సభకు ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ హాజరుకానున్నారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి జన సమీకరణ చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, కొత్తగూడెం జనసేన అభ్యర్థి లక్కినేని సురేందర్‌రావు తెలిపారు. కొత్తగూడెంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఏర్పాటుచేస్తున్న సభకు పవన్‌కల్యాణ్ హాజరవుతారని తెలిపారు. ఉదయం 11 గంటలకు మొదలయ్యే సభకు పవన్‌కళ్యాణ్ అభిమానులు, బీజేపీ, జనసేన శ్రేణులు హాజరుకానుండగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కావునా ఈ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమ్మిశెట్టి వాసు, దర్శనం శ్రీనివాస్, యడ్లపల్లి శ్రీనివాసరావు, పైడిపల్లి రవీందర్, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, రాయుడు నాగేశ్వరరావు, చింతలచెరువు రమేష్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనే ప్రజలకు శ్రీరామరక్ష

- 'కూనంనేని'ని గెలిపించాలని కోరిన రేణుకాచౌదరి



రోడ్‌షోలో మాట్లాడుతున్న రేణుకాచౌదరి, పక్కన కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): కాంగ్రెస్ పాలనే ప్రజలకు శ్రీరామరక్షగా ఉంటుందని.. కొత్తగూడెం పట్టణం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రంలో సమస్యలు తీరాలన్నా సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని పలు ప్రాంతాల్లో బుధవారం జరిగిన రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారని తెలిపారు. స్థానికంగా ఎమ్మెల్యే తీరుతో ఏ సమస్యా పరిష్కారం కాలేదని చెప్పారు. మరో అభ్యర్థి ప్రజలపై అనేక దండయాత్రలు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఈమేరకు ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పాటుపడే సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కోరారు. మరోమారు బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ఏ అభివృద్ధి జరగకపోగా సమస్యలు మరింత పెరుగుతాయని చెప్పారు. ప్రచారంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషాతో పాటు నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, నాగా శీతారాములు, ఆంతోటి పాల్, తోట దేవిప్రసన్న, శంకర్‌నాయక్, ఆంతోటి నాగేశ్వరరావు, గెద్దాడి నాగేష్, సలిగంటి శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, తరాల రాజు, మల్లయ్య, పూసపాటి శ్రీను, బొంకురి పరమేష్, మందా హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

పాల్వంచ: బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి తెలిపారు. పాల్వంచలోని బుధవారం ఏర్పాటుచేసిన వద్ద విలేకరుల సమావేశంలో ఆమెమాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని, ఇళ్లు కట్టుకున్నారని చెప్పారు. ఇక కేసీఆర్ ఇచ్చిన ఇళ్ల పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు తెలుసన్నారు. కనీసం ఇంటింటికి నీళ్లు కూడా ఇవ్వకపోగా, రూ.లక్షల కోట్ల సొమ్ము స్వాహా చేశారని ఆరోపించారు. పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానాన్ని సీపీఐకి కేటాయించినందున కూనంనేని సాంబశివరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావుతో పాటు నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, ఎస్ఏ.జలీల్, డాక్టర్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

టేకులపల్లి: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం యాగశాల ప్రవేశ్, ప్రత్యేక పూజలు, శిలా విగ్రహాల గ్రామోత్సవం, హోమాలు, జలాధివాసం, ధాన్యాధివాసం, అష్టలక్ష్మీ కుంకుమార్చనలు, శుక్రవారం మహాయంత్ర స్థాపన శ్రీసోమలింగేశ్వరస్వామి, జంటనాగులు, అభయాంజనేయస్వామి, శ్రీసరస్వతిదేవి దేవతల శిలావిగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

పాల్వంచ: హనుమకొండలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా సౌత్ వెస్ట్ బాక్సింగ్ పోటీల్లో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వివిధ కేటగిరీల్లో పొట్లపువ్వు హరిప్రియ, సుల్తాన్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ యర్నం చిన్నప్పయ్య, వైస్ ప్రిన్సిపాల్ జె.అబ్రహం, కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

గణేష్‌టెంపుల్‌లో ఎస్పీ సతీమణి పూజలు



అభిషేకం పూజల్లో ప్రీతి వినీత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం(గణేష్‌టెంపుల్)లో బుధవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సతీమణి ప్రీతి వినీత్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఈవో సులోచన ఆధ్వర్యంలో ఆలయంలోని శివాలయంలో జరిగిన అభిషేక పూజల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

క్లుప్తంగా

నియామకం

పాల్వంచ: జనసేన పార్టీ పాల్వంచ మండలాధ్యక్షుడిగా కొండా దేవాగౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేముల కార్తీక్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నదానం

పాల్వంచ: పట్టణంలోని పాలకోయ్య గ్రామానికి చెందిన బాలాజీ బుడియా బాపూ దేవాలయం హజ్రత్ మన్సూర్ షావలి దర్గా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పాల్వంచ బస్టాండ్, బీసీఎం రోడ్డు, కొత్తగూడెం రైల్వే స్టేషన్ తదితర ఏరియాల్లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త భిక్షపతి నాయక్, నిర్వాహకులు ఇస్లావత్ అనిల్ కుమార్ మాట్లాడారు. రూప్ సింగ్, రవికుమార్, రవీందర్, మురళీ నాయక్, వినయ్, సుమన్, గణేశ్, రమేష్, కుమార్, అమర్ సింగ్, చందు తదితరులు పాల్గొన్నారు.



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



కామేపల్లి : కళాకారులతో కలిసి దప్పు వాయిస్తున్న కోరం కనకయ్య



టేకులపల్లి : కనకయ్య సమక్షంలో పార్టీలో చేరిన సర్పంచ్ నీలమయ్య, తదితరులు

- ఇల్లెందు అభ్యర్థి కోరం కనకయ్య

కామేపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య వెల్లడించారు. కామేపల్లి మండలంలోని కామేపల్లి, రామకృష్ణాపురం, కెప్టెన్ బంజర, మద్దులపల్లి, జగన్నాథతండా, బాసిత్‌నగర్ గ్రామాల్లో టీపీసీసీ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనకయ్యమాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని తెలిపారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అడుగడుగునా ఇక్కట్లు ఎదుర్కొన్నారని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని.. తద్వారా ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని తెలిపారు. తెలంగాణ ఏర్పడితే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని ఆశిస్తే ప్రజలను బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు హామీలతో మోసం చేశారని మండిపడ్డారు. అంతేకాకుండా మోసపూరిత వాగ్దానాలతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. కాగా, కెప్టెన్‌బంజరలో నాయకులు ఆదివాసీ, గిరిజన సంప్రదాయ నృత్యాలతో కనకయ్యకు ఘన స్వాగతం పలికారు. అలాగే, మద్దులపల్లిలో ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్ ఆధ్వర్యాన పలువురు బీఆర్‌ఎస్‌ను వీడి కనకయ్య సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్, వైఎస్సార్ టీపీ, సీపీఐ, టీడీపీ నాయకులు బానోత్ సుజాత, సారయ్య, తోటకూరి శివయ్య, మేకల మల్లిబాబుయాదవ్, ఆరెం రవి, గట్టికొప్పుల నారాయణరెడ్డి, రెడబోతు గోపీరెడ్డి, ఇమ్మడి రామనాథం, సుంకిరెడ్డి దామోదర్‌రెడ్డి, అజ్మీరా అర్జున్, ధరావత్ బాలునాయక్, శ్రీరాములు, ఏపూరి మహేందర్, రమేష్‌బాబు, అప్పన పిచ్చయ్య, లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని చింతోనిచెలక సర్పంచ్ వీసం నీలమయ్య బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కోయగూడెంలో ఆయనకు కోరం కనకయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పూనెం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడన నాయకుల ప్రచారం

జూలూరుపాడు: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని బీఆర్‌ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. బుధవారం మండలంలోని పలు ఎన్నికల ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మాచినేనిపేటతండా, పంతులుతండాలో పలు కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, పోలుదాస్ గోపాలక్రిష్ణమూర్తి, ఎదళ్లపల్లి వీరభద్రం, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, చావా వెంకటరామారావు, మూడ్ చిట్టిబాబు, దుద్దుకూరి నాగేశ్వరరావు, సాయిల నాగేశ్వరరావు, కొడెం సీతాకుమారి, ఎంపీటీసీ వాడా లక్ష్మీనర్సమ్మ, వెంకటేశ్వర్లు దంపతులు, సర్పంచ్ భూక్యా రాములు, రెడ్డిబోయిన రాము, రామక్రిష్ణ, చాపలమడుగు రామ్మూర్తి, చందర్, నాగేశ్వరరావు, సునీత, బిక్కు, పుల్లయ్య, కేవ్లా, రెడ్డి, చిన్నా పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు..

కాంగ్రెస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మాళోత్ రాందాస్ నాయక్ గెలుపుకోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీలు కాజా విజయరాణి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్ కుమార్, సున్నా రంగారావు, కాజా రమేష్, లేళ్ల గోపాల్‌రెడ్డి, రాంశెట్టి రాంబాబు, యల్లంకి పుల్లయ్య, సర్పంచ్‌లు బాదావత్ లక్ష్మీ, బానోత్ పద్మ, బానోత్ రమాదేవి, గుగులోత్ రాందాస్, బోడా కైక, పద్మ, మంగీ, నరసింహారావు, పోతురాజు నాగరాజు, పుల్లారావు, బానోత్ సక్రు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, జగన్, బోడా కృష్ణ, మైబూ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు నాయకులు పాల్గొన్నారు.

జలగం ప్రచారం..

సుజాతనగర్: మరోసారి తనను ఆశీర్వదించాలని కొత్తగూడెం నియోజకవర్గ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే అభ్యర్థి జలగం వెంకట్రావు ఓటర్లను కోరారు. సింగభూపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపిచ్చిరెడ్డి, చింతలపూడి జగన్, కొల్లి నరేంద్రబాబు, ఉబ్బనపల్లి మణికంఠ, శ్రీనివాసరావు, నర్రా అజయ్, యాకుబ్ అలీ, గూని వీరభద్రరావు, లావుడ్యా గోపి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన జెడ్పీటీసీ..

బీఆర్‌ఎస్ పార్టీ జెడ్పీటీసీ లావుడ్యా బిందూ చౌహాన్ జలగం వెంకట్రావుకు మద్దతు తెలిపారు. గత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆమె అకస్మాత్తుగా మద్దతు తెలిపి ప్రచారంలో పాల్గొన్నారు. జెడ్పీటీసీతో పాటు పాత అంజనాపురం సర్పంచ్ భూక్యా రవికుమార్ జలగంకు మద్దతు తెలిపారు.

ఎన్డీ నాయకులు..

ఇల్లెందు: ఇల్లెందులో ఎన్డీ బలపర్చిన అభ్యర్థి మాణిక్యారం సర్పంచ్ మోకాళ్ల కృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ ఎన్డీ రాష్ట్ర సహాయకార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధులు ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.సంధ్య, జి.ఝాన్సీ, చలపతిరావు, జే. సీతారామయ్య, అభ్యర్థి మోకాళ్ల కృష్ణ, ఎన్డీ మధు, చంద్రన్న వర్గం నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల కృష్ణను గెలిపించాలని కోరుతూ మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ గొని నాగేశ్వరరావు, నరాటి వెంకన్న, అనిల్‌రెడ్డి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులు...

టేకులపల్లి: సీపీఎం ఇల్లెందు అభ్యర్థి దుగ్గి క్రిష్ణను గెలిపించాలని పార్టీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్జ సురేష్, పార్టీ మండల కార్యదర్శి ఈసం నర్సింహారావు, మండల కమిటీ సభ్యులు కడుదుల వీరన్న, పూనెం స్వామి, వార్డుమెంబర్ పూనెం చంద్రశేఖర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ లేని పార్టీని నమ్మొద్దు

- మంత్రి సత్యవతి రాథోడ్
- హరిప్రియ గెలుపు కోరుతూ ప్రచారం



బయ్యారం: మాట్లాడుతున్న మంత్రి సత్యవతి, పక్కన హరిప్రియ



గార్ల: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బయ్యారం: ఎప్పుడు ఎవరు సీఎంగా ఉంటారో తెలియని.. గ్యారంటీ లేని కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మొద్దని మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. ఇల్లెందు బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియను గెలిపించాలని కోరుతూ బుధవారం బయ్యారంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. వెనుకబడిన ఇల్లెందు అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అవసరమైన రహదారులను నిర్మించలేదన్నారు. అలాగే, నమ్మి పదవి ఇస్తే బీఆర్‌ఎస్‌ను మోసం చేసిన కనకయ్యకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈసారి హరిప్రియ గెలవగానే బయ్యారం పెద్ద చెరువుకు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకొచ్చి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించే బాధ్యత తనదేనన్నారు. అంతకుముందు మండలంలోని అల్లిగూడెం, జగత్‌రావుపేట, కొత్తగూడెం, జగ్గుతండాలో హరిప్రియ ప్రచారం చేయగా, వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎంపీపీ మౌనిక, వైస్ ఎంపీపీ గణేష్, జెడ్పీటీసీ ఉమాదేవి, సత్యనారాయణ, ఐలయ్య, శ్రీను, సోమిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం

కామేపల్లి/టేకులపల్లి: ఇల్లెందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ గెలుపు ఖాయమని కామేపల్లి జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు అన్నారు. మండలంలోని తాళ్లగూడెంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేసిన వారు మాట్లాడారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, అదే కాంగ్రెస్‌కు ఓటు వేస్తే భవిష్యత్ ఆగమవుతుందని తెలిపారు. నాయకులు శెట్టి శ్రీనివాస్, పుచ్చకాయల బాబు, ముత్యం రాయకృష్ణ, పుచ్చకాయల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టేకులపల్లి మండలం చుక్కాలబోడుకుచెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి భూక్య రమేష్‌నాయక్ బీఆర్‌ఎస్‌లో చేరగా బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు.

హరిప్రియను ఆశీర్వదించండి

గార్ల: ఇల్లెందు బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియను గెలిపించాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శీలంశెట్టి రమేష్ కోరారు. ఈ సందర్భంగా గార్లలో ఇంటింటి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు. ఉత్తరయ్య, భాస్కర్‌రావు, శ్రీకాంత్, రమేష్, అనిల్, షఫీ, రవీందర్ పాల్గొన్నారు.